# నేటినిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 9-7-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:249 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**



సక్షమ వ్యూహమ్ములతో
దక్షతగల దేశభక్త దళములతోడన్
లక్షల సాధనములతో
రక్షణ రంగమ్ము వెలుగు రణజన్ములతోన్ !!


భారత రక్షణ వ్యవస్థకు తిరుగే లేదని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఈరోజు అన్నారు



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

సర్కారు కార్మికుల
చట్టాలను చేసే రద్దు
కోడులతో కార్పొరేటర్ల
కౌగిలిస్తూ చేసే ముద్దు
నిరసనగా శ్రామికజన
నిరసనాగ్ని మంట హోరు
సాగె నేడు దేశమంతా
సార్వత్రిక సమ్మె పోరు



-వేల్పుల నారాయణ
9440433475

# వైఎస్ఆర్ పేరుతో అవార్డులు..డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, జులై 8: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరుతో అభ్యుదయ రైతులకు అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అందులో భాగంగా వైఎస్ఆర్ పేరు మీద ఒక ఫౌండేషన్ ను ఏర్పాటు చేసి దాని ద్వారా కార్యక్రమాలను నిర్వహించాలనే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం నాడు బంజారాహిల్స్ వద్ద కాంగ్రెస్ నేతలు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## వచ్చే వర్ధంతికి అవార్డులు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. వచ్చే వర్ధంతి కల్లా ఒక కార్యక్రమాన్ని రూపకల్పన చేసి వ్యవసాయం రంగంలో నిష్ణాతులైన వారిని, వ్యవసాయంపై రీసెర్చ్ చేస్తున్న వారిని, ఈ ప్రాంత అభివృద్ధికి వ్యవసాయ రంగానికి దోహదపడుతున్న వారిని గుర్తించి వైఎస్ఆర్ పేరు మీద అవార్డులు ఇవ్వాలని ఆలోచన చేస్తున్నామని చెప్పారు. వైఎస్ఆర్ ను నిత్యం స్మరిస్తూ.. వారి ఆలోచనను ముందుకు తీసుకువెళతామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వైఎస్ఆర్ అంటే మొదట గుర్తుకువచ్చేది వ్యవసాయం.. ప్రాజెక్టులేనని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. రెండు జీవనదుల్లో ప్రవహిస్తున్న నీటిని ప్రాజెక్టులు కట్టి నీటిని పంట పొలాలకు పారించిన ఆలోచన వైఎస్ఆర్ ది అని కొనియాడారు. వైఎస్ఆర్ భౌతికంగా లేని లోటును ఎవ్వరూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రజలకు తీర్చలేరని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

## కెటిఆర్ కు భట్టి కౌంటర్

సిఎం రేవంత్ సవాల్‌ను జీర్ణించుకోలేక అడ్డగోలుగా కెటిఆర్ మాట్లాడుతున్నారని భట్టి విమర్శించారు. ఇక భవిష్యత్‌లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని అన్నారు.. దమ్ముంటే అసెంబ్లీలో తేల్చుకుందామని, అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ రావాలని పిలుపు ఇచ్చారు. గోదావరి, కృష్ణ జలాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

# నగరంలోని సిటీ సివిల్ కోర్టుకు బాంబు బెదిరింపు ఫోన్ కాల్

హైదరాబాద్ జూలై 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : హైదరాబాద్ నగరంలోని సిటీ సివిల్ కోర్టుకు బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. సిటీ సివిల్ కోర్టులో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని దుండగుడు ఫోన్ చేసి బెదిరించాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కోర్టు కార్యకలాపాలను నిలిపివేశారు. కోర్టు సిబ్బందిని బయటకు పంపించేశారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. చీఫ్ మెజిస్ట్రేట్ కార్యాలయాన్ని మూసివేశారు. న్యాయవాదులు, సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

# మానుకోట అభివృద్ధికి బాటలు - ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మహబూబాబాద్, జులై 8:(నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, 18 నెలలు కాలంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నాడు. మంగళవారం మహబూబాబాద్ జిల్లాలోని పర్వతగిరి, సోమ్లా తండలో పలు అభివృద్ధి కార్యక్రమాలను డిప్యూటీ సీఎం భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి ప్రారంభమైందన్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, గిరిజన ప్రాంతాలకు అధిక శాతం నిధులు కేటాయించడం జరిగిందన్నారు.

## అభివృద్ధికి అడ్డుపడుతున్న బీఆర్ఎస్



రాష్ట్రంలో అభివృద్ధికి బీఆర్ఎస్ నేతలు అభివృద్ధికి, అడ్డుపడుతూ ముఖ్యమంత్రిపై స్థాయికి మించి, విమర్శలు చేస్తున్నారని భట్టి అన్నారు. బీఆర్ఎస్ నేతలు చౌకబారు మాటలు మానుకోవాలని హితవు పలికారు. ఇలాంటి నాయకులకు ప్రజలే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఒక సైనికుల పనిచేస్తూ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రామచంద్ర నాయక్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క), తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు నాగరాజు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# బస్తర్‌లో మందుపాతర పేలుడు.. ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్‌లకు తీవ్ర గాయాలు

హైదరాబాద్, జులై 8:మందు పాతర పేలి ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్‌లు తీవ్ర గాయాలపాలైన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ డివిజన్ లోని బీజాపూర్ జిల్లాలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రస్తుతం గాయపడిన ఇద్దరు జవాన్‌ల పరిస్థితి విషమంగా ఉందని బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్‌లు రోడ్డు ఓపెనింగ్ కార్యక్రమానికి భద్రత కోసం వెళ్లిన సమయంలో మావోయిస్టులు పాతిపెట్టిన మందుపాతర పేలింది. పేలుడు అనంతరం మావోయిస్టులకు, జవాన్‌లకు మధ్య కాల్పులు కూడా చోటుచేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ముర్దొండ సెక్యూరిటీ క్యాంపు దగ్గరలోని ఆవపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలోగల తిమాపూర్- ముర్దొండ రోడ్డుపై ఈ ఘటన చోటుచేసుకుంది.గాయపడిన జవాన్‌లు ప్రస్తుతం రాయ్‌పూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ముందుగా స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం రాయ్‌పూర్‌కు తరలించారు.

# తెలంగాణలో రాబోయే మూడురోజుల వర్షాలు

హైదరాబాద్ జూలై 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణలో రాబోయే మూడురోజుల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ క్రమంలో ఈ మూడు జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో బలమైన ఈదురుగాలులతో భారీ వర్షాలు కొనసాగుతాయని పేర్కొంది.బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల నిర్మల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని.. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు నమోదవుతాయని పేర్కొంది. గురువారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వానలు పడుతాయని చెప్పింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# దేవాలయాల అభివృద్ధికి నా వంతు కృషి : ఎమ్మెల్యే ముఠాగోపాల్



హైదరాబాద్, జులై 8:ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని దేవాలయాల అభివృద్ధికి తన వంతు ఎంతో కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్‌లోని సిద్ధంశెట్టి అపార్ట్‌మెంట్ ఆవరణలో ఉన్న బంగారం పోచమ్మ తల్లి దేవాలయం అభివృద్ధికి ఎంతో సహకారం అందించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బోనాల పండుగకు హాజరుకావాలని ఆహ్వానించారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి జితేందర్, సంయుక్త కార్యదర్శి ప్రసన్న, పద్మ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


# అరుణాచల పుణ్యక్షేత్ర దర్శనానికి ప్రత్యేక బస్సు : డిపో మేనేజర్ కే కవిత



హైదరాబాద్, జులై 8:విజ్ఞాన విహార యాత్రలకు టీఎస్ఆర్టీసీ అందిస్తున్న ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ప్రజలు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే కవిత సూచించారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో మంగళవారం డిపో మేనేజర్ కే కవిత మాట్లాడుతూ అరుణాచల పుణ్యక్షేత్ర దర్శనానికి ఈ నెల 11న సాయంత్రం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

జూలై 11 శుక్రవారం సాయంత్రం చెంగిచెర్ల నుండి ఉప్పల్ బస్టాండ్, ఉప్పల్ చౌరస్తా, నాగోల్ చౌరస్తా, ఎల్బీనగర్, అరాంఘర్ మీదుగా కానిపాకం విఘ్నేశ్వర స్వామి దర్శనం, అనంతరం వెల్లూరు గోల్డెన్ టెంపుల్ అమ్మవారి దర్శనం, అనంతరం అరుణాచల శివ దర్శనం ఉంటుందన్నారు. ఈ నెల 13 ఆదివారం సాయంత్రం అరుణాచలం నుండి బయలుదేరి సోమవారం ఉదయం తిరిగి చేరుకుంటుందని ఆమే పేర్కొన్నారు. ఈ ప్రయాణానికిగాను పెద్దలకు రూ.3900, పిల్లలకు రూ.3300 రవాణా చార్జీ ఉంటుందని తెలిపారు.

ఆర్టీసీ సంస్థ కల్పిస్తున్న ప్రత్యేక దర్శనసౌకర్యాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ద్వారాగాని, చెంగిచెర్ల డిపోలోగాని టికెట్లను బుక్ చేసుకోవచ్చని ఆమె చెప్పారు. 35 మంది గ్రూపుగా ఉన్నట్లయితే మీ ఇంటి వద్దకే బస్ సౌకర్యం కల్పిస్తామన్నారు. సంస్థ కల్పిస్తున్న ఈ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకొని దైవదర్శనం చేసుకుని తరించాలని ఆమె కోరారు. వివరాలకు డిపో మేనేజర్ ఫోన్ 789308843, అసిస్టెంట్ మేనేజర్ 9063413318 నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.




# జనగామలో దారుణం.. ఇద్దరు భార్యల చేతిలో భర్త హతం

జనగామ, జులై 8: జనగామ జిల్లా లింగలఘనపురం మండలంలో దారుణం చోటుచేసుకున్నది. ఇద్దరు భార్యలు కలిసి భర్తను హత్యచేశారు లింగాలఘనపురం మండలంలోని ఏనబావి గ్రామ శివారు పిట్టలోనిగూడెంకు చెందిన కాల్య కనకయ్య (30)కు ఇద్దరు భార్యలు ఉన్నారు. మద్యానికి బానిసైన కనకయ్య తరచూ తన ఇద్దరు భార్యలను వేధిస్తుండేవాడు.

ఈ క్రమంలో వే 18న నల్లగొండ జిల్లాలోని ఓ తోటలో తన రెండో భార్య శిరీష తల్లి జన్నువాయిని తాగిన మైకంలో హత్య చేశాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. అప్పుడప్పుడు గ్రామానికి వస్తూ.. భార్యలను, గ్రామస్థులను బెదిరిస్తుండేవాడు. సోమవారం రాత్రి గ్రామానికి వచ్చిన కనకయ్య భార్యలతో గొడవపడ్డారు. వారిని గొడ్డలితో బెదిరించాడు.

# ఉపాధి హామీ ఏపీవోలకు జీతాలు చెల్లించకపోవడం శోచనీయం : హరీశ్‌రావు

హైదరాబాద్, జులై 8:జీతం రాకపోవడంతోపాటు పని ఒత్తిడి తట్టుకోలేక గుండెపోటుతో ఉపాధి హామీ ఏపీవో మృతి చెందిన ఘటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు.

ఉపాధి హామీ ఏపీఓలకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం శోచనీయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. చేసిన పనికి వేతనాలు రాక ఉపాధి హామీ సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ కుటుంబ పోషణ భారమై సతమతమవుతుంటే ఈ ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి మనోవేదనకు గురై ఉపాధి హామీ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రావడం విచాకరం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

మరోవైపు పారిశుధ్య కార్మికులకు కూడా వేతనాలు రాక గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ఎన్నికల సమయంలో హామీలతో ఊదరగొట్టిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఏమని సమాధానం చెబుతారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉపాధి హామీ ఏపీవోలు, పారిశుధ్య కార్మికుల పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన కమ్మగాని శ్రీనివాస్ (48) దేవరుప్పుల మండలంలో ఉపాధి హామీ ఏపీవోగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం శ్రీనివాస్ మార్నింగ్ వాక్‌కు వెళ్లగా, దేవరుప్పులలోని జనగామ రోడ్డులో గల ఓ మోటర్ వెహికిల్ షోరూం వద్ద గుండెపోటు రావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పని ఒత్తిడితోపాటు మూడు నెలలుగా జీతం రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో ఏపీవో మృతి చెందాడని ఆరోపిస్తూ ఉపాధి హామీ ఉద్యోగులు, సిబ్బంది నిరసన తెలిపారు. ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రావు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రావు మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బందిపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని ఆరోపించారు.

# దెయ్యం వదిలిస్తామంటూ నాలుగు గంటలు చిత్రవధ.. దెబ్బలు తాళలేక మహిళ మృతి..!

బీహార్ జులై 8:ఆధునిక సాంకేతికతతో సమాజం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నా.. కొన్ని ప్రాంతాల్లో ఇంకా మూఢనమ్మకాలు రాజ్యమేలుతున్నాయి. చేతబడి, క్షుద్రపూజల పేరుతో పలు ప్రాంతాల్లో అమాయకుల ప్రాణాలు తీస్తున్నారు. తాజాగా బీహార్ లో చేతబడి చేస్తున్నారనే అనుమానంతో ఓ కుటుంబంలోని ఐదుగురిని గ్రామస్తులు సజీవ దహనం చేశారు. అదేవిధంగా కర్ణాటక లో దెయ్యం పట్టిందని ఓ మహిళను కొట్టిచంపారు.

వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ జిల్లాకు చెందిన 55 ఏళ్ల మహిళ గీతమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. దాంతో ఆమె కుమారుడు ఆమెను బూత వైద్యం చేసే దంపతుల దగ్గరికి తీసుకెళ్లాడు. వాళు దెయ్యాన్ని వదిలించే పేరుతో సోమవారం రాత్రి 9.30 గంటల నుంచి 1.30 గంటల వరకు నాలుగు గంటలపాటు చిత్రవధ చేశారు. చేతులతో, కర్రలతో తీవ్రంగా కొట్టారు. దాంతో ఆమె దెబ్బలకు తాళలేక ప్రాణాలు కోల్పోయింది.



# అభివృద్ధి చెందిన గ్రామాలు మరియు సంపన్న రైతులు లేకుండా అభివృద్ధి చెందిన భారతదేశం యొక్క దార్శనికత అసంపూర్ణంగా ఉంటుంది - శ్రీ ధర్మేంద్ర ప్రధాన్



న్యూఢిల్లీ, జులై 8:ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ వ్యవసాయ మరియు సాంకేతిక విశ్వవిద్యాలయం (ాఎఖజఐ)లో కేంద్ర విద్యా మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ మరియు నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) మరియు విద్యా శాఖ సహాయ మంత్రి శ్రీ జయంత్ చౌదరి సంయుక్తంగా ఉత్తరప్రదేశ్ అగ్రిటెక్ ఇన్నోవేషన్ హబ్ మరియు అగ్రిటెక్ స్టార్టప్ మరియు టెక్నాలజీ షోకేస్‌ను ఈరోజు ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ, వ్యవసాయ విద్య మరియు వ్యవసాయ పరిశోధన మంత్రి శ్రీ సూర్య ప్రతాప్ షాహి; ఎమి రోపర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజీవ్ అహుజా; ాఎఖజఐ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.కె. సింగ్; మరియు ఇతర ప్రముఖులు కూడా హాజరయ్యారు.

ప్రేక్షకులను ఉద్దేశించి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ప్రసంగిస్తూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వ్యవసాయ మరియు సాంకేతిక విశ్వవిద్యాలయాన్ని ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మరియు భారతీయ రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే పాఠ్యాంశాలను రూపొందించినందుకు అభినందించారు. అభివృద్ధి చెందిన గ్రామాలు మరియు సంపన్న రైతులు లేకుండా అభివృద్ధి చెందిన భారతదేశం యొక్క దార్శనికత అసంపూర్ణమని, ఈ చొరవ ఆ దిశలో అర్థవంతమైన మరియు చారిత్రాత్మక అడుగు అని ఆయన అన్నారు.

దేశవ్యాప్తంగా టెక్నాలజీ ఆధారిత వ్యవసాయ ఆవిష్కరణలను ప్రోత్సహించినందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీకి శ్రీ ప్రధాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ చొరవలో భాగంగా, ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో ఎఐ, మెషిన్ లెర్నింగ్ మరియు డేటా అనలిటిక్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల ప్రయోజనాలు భారతదేశ వ్యవసాయ రంగాలకు చేరేలా 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్' ఏర్పాటును ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు. "ఎఐ ఇన్ అగ్రికల్చర్" పై ఎక్సలెన్స్ సెంటర్‌గా పనిచేయడానికి ఐఐటీ రోపర్‌కు అప్పగించిన బాధ్యత ఈ అగ్రిటెక్ ఇన్నోవేషన్ హబ్‌ను సృష్టించడంలో ముగిసిందని ఆయన అన్నారు.

భారతదేశం యొక్క ఆత్మ దాని పొలాలు మరియు పశువుల దొడ్లలో నివసిస్తుందని మంత్రి పేర్కొన్నారు. దేశంలో సేవా రంగం ప్రపంచ ప్రమాణాలను చేరుకున్నప్పటికీ, భారతదేశం యొక్క శ్రేయస్సు యొక్క ప్రాథమిక ఆధారం ఇప్పటికీ దాని వ్యవసాయ భూమిలోనే ఉందని ఆయన నొక్కి చెప్పారు. రైతుల అభ్యున్నతి కోసం ప్రధానమంత్రి దార్శనికత ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో సాకారం అవుతోందని ఆయన అన్నారు. సాంకేతికత మరియు ఆవిష్కరణల సంగమం ద్వారా రాష్ట్రం ఇప్పుడు కొత్త శక్తిని పొందుతోందని కూడా శ్రీ ప్రధాన్ అన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జీ మరియు చౌదరి చరణ్ సింగ్ జీ రైతుల పట్ల చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ, రైతుల ఆదాయాలు రెట్టింపు అయ్యి, వారిని స్వావలంబన మరియు సంపన్నులుగా మార్చినప్పుడు వారికి నిజమైన నివాళి అర్పించబడుతుందని శ్రీ ప్రధాన్ అన్నారు. ప్రపంచ ఆహార సంక్షోభాలు మరియు వాతావరణ మార్పుల వల్ల ఎదురయ్యే సవాళ్ల మధ్య, రసాయన రహిత, సహజ వ్యవసాయాన్ని అవలంబించడం మరియు సాంకేతికత క్షేత్రం నుండి మార్కెట్‌కు తరలించేలా చూసుకోవడం ఈ సమయంలో అవసరమని ఆయన అన్నారు. అగ్రిటెక్ ఇన్నోవేషన్ హబ్ ఉత్తర భారతదేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ మరియు వేగాన్ని అందిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రారంభోత్సవంలో శ్రీ జయంత్ చౌదరి మాట్లాడుతూ, గ్రామీణ యువత మరియు రైతులు వ్యవసాయ సాంకేతిక ఆధారిత పురోగతి యొక్క కొత్త శకాన్ని స్వీకరించడానికి ఈ హబ్ యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. సంప్రదాయాన్ని సాంకేతికతతో అనుసంధానించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన హైలైట్ చేశారు. ఆవిష్కరణ నేలలో వేళ్ళూనుకున్నప్పుడు నిజమైన పరివర్తన ప్రారంభమవుతుందని ఆయన అన్నారు. ఐఐటి రోపర్ యొక్క డీప్-టెక్ నైపుణ్యం మద్దతుతో మీరట్‌లోని అగ్రిటెక్ ఇన్నోవేషన్ హబ్ కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు - ఇది ఖచ్చితమైన వ్యవసాయానికి మార్గదర్శకులుగా మన రైతులను శక్తివంతం చేసే ఉద్యమం అని ఆయన అన్నారు. శ్రీ చౌదరి మాట్లాడుతూ, ఇది ఒక సౌకర్యం కంటే ఎక్కువ, రైతులు, పరిశోధకులు మరియు స్టార్టప్‌లు భవిష్యత్తు కోసం స్థిరమైన మరియు స్కేలబుల్ వ్యవసాయ పరిష్కారాలను సహ-సృష్టించడానికి కలిసి వచ్చే సహకార పర్యావరణ వ్యవస్థ అని అన్నారు. అన్నింటికంటే, సాంకేతికత నిజంగా అర్థవంతంగా ఉంటుంది, అది భూమిలో పాతుకుపోయి, ఉద్ధరించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు మాత్రమే అని ఆయన నొక్కి చెప్పారు.

# హైదరాబాద్ సెక్రటరీ నుంచి ఉత్తర్వులు జారీ

ఖమ్మం వైద్య విభాగం, జులై 8(ఆంధ్ర ప్రభ) : ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్, జనరల్ ఆస్పత్రి అధికారులను బదిలీ చేస్తూ మంగళవారం ప్రభుత్వ సెక్రటరీ ఉత్తర్వులు (ాతీటవతీబ) జారీ చేశారు. ఖమ్మంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ గా డాక్టర్ టి శంకర్ జీజీహెచ్ సూపరింటెండెంట్ ను డాక్టర్ ఎం.నరేందర్ ను నియమించారు.

ప్రస్తుతం మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ గా పనిచేస్తున్న డాక్టర్ రాజేశ్వరరావు హెచ్ఓడి మైక్రో బయాలజీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ గా పని చేస్తున్న డాక్టర్ కిరణ్ కుమార్ హెచ్ ఓ డి ఆర్థోపెడిక్ డిపార్ట్ మెంట్ కు వెళ్లనున్నారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్, జనరల్ ఆసుపత్రి అధికారులను బదిలీ చేస్తూ మంగళవారం ప్రభుత్వ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు.

# శ్రీశైలంలో సీఎం చంద్రబాబు ప్రత్యేక పూజలు



శ్రీశైలం, జులై 8: నంద్యాల జిల్లా శ్రీశైలం జలాశయంలో జలహారతి కార్యక్రమంలో పాల్గొను నిమిత్తం మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీశైలంకు చేరుకున్నారు. శ్రీశైలం లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి మంత్రులు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ద్వాదశాలలో రెండవ జ్యోతిర్లింగం, ఆరవ అష్టాదశ శక్తిపీఠం, ఇలలో వెలసిన కైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దర్శనార్థం మంగళవారం ఆలయానికి చేరుకున్నారు. ఈసందర్భంగా ఆలయ సంప్రదాయం ప్రకారం ముఖ్యమంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదమంత్రాలతో స్వామివారి దర్శనార్థం ఆలయంలోకి వెళ్లారు. ఆలయంలో ప్రథమంగా రత్నగర్భ గణపతిని దర్శించుకున్న సీఎం చంద్రబాబునాయుడు అనంతరం శ్రీశైల మల్లికార్జున స్వామిని, శ్రీ భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకుని అర్చన కార్యక్రమంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో రుద్ర హోమం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఈకార్యక్రమంలో మంత్రులు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, దేవదాయ శాఖ సెక్రెటరీ వినయ్ చంద్, కమిషనర్ రామచంద్ర మోహన్, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, ఆలయ ఈవో శ్రీనివాసరావు, జేఈవో, పీఆర్వోలు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆసియా మరియు పసిఫిక్ ప్రాంతానికి ఐఎస్ఏ యొక్క ఏడవ ప్రాంతీయ కమిటీ సమావేశం

న్యూఢిల్లీ, జులై 8:ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ (ఐఎస్ఏ) ఆసియా మరియు పసిఫిక్ ప్రాంతానికి ఏడవ ప్రాంతీయ కమిటీ సమావేశం (ఖీఅఓ)ను శ్రీలంకలోని కొలంబోలో 2025 జూలై 15?17 వరకు నిర్వహిస్తుంది. ఈ ముఖ్యమైన సమావేశం ప్రభుత్వ అధికారులు, సాంకేతిక విశ్వవిద్యాలయాలు, థింక్ ట్యాంకులు, సంస్థాగత భాగస్వాములు మరియు ప్రైవేట్ రంగానికి చెందిన నాయకులను ఒకచోట చేర్చి ఈ డైనమిక్ మరియు వైవిధ్యభరితమైన ప్రాంతంలో సౌర విస్తరణను స్కేలింగ్ చేయడానికి సమన్వయంతో కూడిన మరియు వ్యూహాత్మక ఎజెండాను ముందుకు తీసుకువెళుతుంది. 'వైవిధ్యం మరియు అవకాశాల ప్రాంతంలో సౌర సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడం' అనే థీమ్‌తో, ఈ సమావేశం ప్రపంచ సౌర పరివర్తనలో ఒఖంఅ ప్రాంతం యొక్క నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి వ్యూహాత్మక సంభాషణ, జ్ఞాన మార్పిడి మరియు కార్యాచరణ-ఆధారిత ఫలితాల సంగమంగా ఉపయోగపడుతుంది.

స్వచ్ఛమైన ఇంధన భవిష్యత్తును రూపొందించడంలో ఆసియా మరియు పసిఫిక్ ప్రాంతం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, ఐఎస్ఏ డైరెక్టర్ జనరల్ శ్రీ ఆశిష్ ఖన్నా ఇలా వ్యాఖ్యానించారు, "ఆసియా మరియు పసిఫిక్ ప్రాంతం ప్రపంచ ఇంధన పరివర్తనకు కేంద్రంగా ఉంది. కొలంబోలో జరిగే ప్రాంతీయ కమిటీ సమావేశం దేశాలు మరియు సాంకేతికతలను విస్తరించగల సామర్థ్యంతో ఆచరణాత్మకమైన, పెట్టుబడికి సిద్ధంగా ఉన్న పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి ఒక అవకాశం. ఎస్ఐడిఎస్ కోసం ప్రాంతీయ సమగ్ర సౌరశక్తి వేదికలను అభివృద్ధి చేయడం, దేశాల మధ్య ప్రాంతీయ పరస్పర సంబంధాలను ప్రారంభించడం, సౌర మరియు డిజిటల్ ఆవిష్కరణల ఏకీకరణ కోసం ఆసియా సంస్థలను పెంచడం లేదా గ్రీన్ హైడ్రోజన్ మరియు నిల్వ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానాల వృద్ధికి మద్దతు ఇవ్వడం వంటివి చేసినా, ఈ సమావేశం భాగస్వామ్యాలు మరియు స్థానిక నాయకత్వంపై ఆధారపడిన సౌరశక్తితో నడిచే భవిష్యత్తు వైపు ఒక మార్గాన్ని రూపొందించడంలో సహాయపడుతుంది."

శ్రీలంక సోషలిస్ట్ రిపబ్లిక్ ఆఫ్ శ్రీలంక నుండి ఉపాధ్యక్షుడు అధ్యక్షత వహించిన RCM, ISA యొక్క అభివృద్ధి చెందుతున్న వ్యూహాత్మక దృష్టితో ప్రాంతీయ సౌర ప్రాధాన్యతలను సమలేఖనం చేయడానికి ఒక వేదికగా పనిచేస్తుంది, దాని నాలుగు ప్రాథమిక స్తంభాలలో లంగరు వేయబడింది:ఉత్ప్రేరక ఫైనాన్స్ హబ్: ఆసియా మరియు పసిఫిక్ అంతటా సారూప్య సౌకర్యాలను స్కేల్ చేసే ఉద్దేశ్యంతో, ఆఫ్రికాలో ఐఎస్ఏ అనుభవాలపై నిర్మించడానికి, సోలార్ పెట్టుబడులను తగ్గించడానికి ఉత్ప్రేరక మరియు మిశ్రమ ఆర్థిక చొరవలను విస్తరించడం.

గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ మరియు డిజిటలైజేషన్: ాంఖీ సెంటర్లను అనుసంధానించే హబ్-అండ్-స్పోక్ మోడల్ ద్వారా 'సిలికాన్ వ్యాలీ ఫర్ సోలార్' యొక్క ఐఎస్ఏ దృష్టిని పురోగమిస్తోంది, సోలార్‌ఎక్స్ స్టార్టప్ ఛాలెంజ్ ద్వారా ఆవిష్కరణలను పెంపొందిస్తుంది మరియు సభ్య దేశాలలో అనుకూలీకరించిన సాంకేతిక సహాయాన్ని అందిస్తుంది.

ప్రాంతీయ మరియు దేశ-స్థాయి ప్లాట్‌ఫారమ్‌లు ఎస్ఐడిఎస్ ప్లాట్‌ఫారమ్ వంటి చొరవలను విస్తరించడం.

# విశాఖకు భారీ ఐటీ సంస్థ.. 10 వేల ఉద్యోగాలతో ఏఎన్ఎస్ఆర్ క్యాంపస్

-విశాఖలో ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ఏర్పాటు
-ఏపీ ప్రభుత్వంతో కీలక అవగాహన ఒప్పందం
-మధురవాడ ఐటీ క్లస్టర్‌లో అత్యాధునిక క్యాంపస్ నిర్మాణం
-విశాఖను జీసీసీ రాజధానిగా మారుస్తామన్న మంత్రి లోకేశ్
-రాష్ట్రానికి టాప్-100 ఐటీ కంపెనీలను రప్పిస్తామని వెల్లడి


అమరావతి, జులై 8:ఏపీని పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యంలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల అభివృద్ధికి ఊతమిస్తూ, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల ఏర్పాటులో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఏఎన్ఎస్ఆర్ సంస్థ విశాఖపట్నంలో భారీ క్యాంపస్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. మధురవాడ ఐటీ క్లస్టర్‌లో



అత్యాధునిక జీసీసీ ఇన్నోవేషన్ క్యాంపస్‌ను స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా రానున్న ఐదేళ్లలో 10,000 మందికి పైగా నాణ్యమైన ఉద్యోగాలు లభించనున్నాయి.

మంత్రి నారా లోకేశ్ సమక్షంలో నేడు ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ఈ సందర్భంగా ఏఎన్ఎస్ఆర్ సంస్థ సీఈఓ లలిత్ అహూజా మాట్లాడుతూ, "ప్రపంచ స్థాయి ప్రతిభ, బలమైన మౌలిక సదుపాయాలు, దార్శనిక నాయకత్వం వంటివి విశాఖలో మేళవించి ఉన్నాయి. ఇవి అద్భుతాలు సృష్టించేందుకు దోహదపడతాయి. మా ఇన్నోవేషన్ క్యాంపస్ ప్రపంచంలోని ప్రతిష్ఠాత్మక సంస్థలకు విశాఖను ఒక ప్రధాన గమ్యస్థానంగా మారుస్తుంది" అని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతిభావంతులను ప్రపంచ స్థాయి కంపెనీలతో అనుసంధానించడంలో తమ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు.

# ఎపిలో చిల్లీ, జీడిపప్పు, మామిడిబోర్డులు ఏర్పాటు చేయండి -కేంద్ర మంత్రికి అచ్చెన్న వినతి



న్యూఢిల్లీ, జులై 8:గుంటూరులో చిల్లీ బోర్డ్ , శ్రీకాకుళంలో జీడిపప్పు బోర్డ్ , చిత్తూరులో మామిడి బోర్డ్‌ని ఏర్పాటు చేయాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. విభజన చట్టం ప్రకారం శ్రీకాకుళం జిల్లాలో కేంద్ర అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న అచ్చెన్నాయుడు నేడు మంత్రి చాంబర్ లో కలిశారు. ఈ సందర్భంగా ఎపిలోని రైతుల సమస్యలపైఆయనకు వివరించారు.

రాష్ట్రంలో వ్యవసాయరంగా సమగ్రా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించాలని కేంద్రమంత్రిని కోరారు. మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా ప్రస్తావించారు. తోతాపురి మామిడి ధర తగ్గడంతో రైతులకు నష్టం వాటిల్లుతోందని చెప్పారు. ధర రూ.8కి పడిపోవడంతో ఏపీ ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ధరల లోటు చెల్లింపు పథకం కింద మద్దతు ధరగా ఏపీ ప్రభుత్వం రూ.12 ధర నిర్ణయించినట్లు వివరించారు మంత్రి అచ్చెన్నాయుడు. 6.5 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి కొనుగోలు చేయాల్సి ఉందని అచ్చెన్నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.260 కోట్లు ఖర్చు చేస్తోందని.. కేంద్ర భాగస్వామ్యం కావాలని కోరారు. మామిడి ధర రూ.8లకి పడిపోవడంతో రైతులకి వచ్చిన నష్టనివారణకు మద్దతు ధర అనివార్యమైందని చెప్పారు. వెనుకబడిన జిల్లాల కోసం మైక్రో ఇరిగేషన్ పథకానికి రాయితీ పెంపుపై విజ్ఞప్తి చేశారు. బుందేల్‌ఖండ్ తరహాలో ఏపీకి కేంద్రప్రభుత్వం అదనపు సాయం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు.

మంత్రి అచ్చెన్నాయుడు వినతుల పై సానుకూలంగా కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పందించారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాగా, అచ్చెన్న వెంట పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా ఉన్నారు.

# వైఎస్సార్ జయంతి .. తండ్రికి తనయ, తనయుడు ఘనంగా నివాళి



అమరావతి, జులై 8: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి సందర్భంగా.. తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనూ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు.. ఇక, ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించారు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం తల్లి విజయమ్మను ప్రేమగా పలకరించారు జగన్.. ఈ సందర్భంగా జగన్ ను ఆశీర్వదించారు తల్లి విజయమ్మ. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలలో వైఎస్ కుటుంబ సభ్యులు.. ఉమ్మడి కడప జిల్లాలోని వైసీపీ నేతలు.. అభిమానులు ఇలా పెద్ద ఎత్తున తరలివచ్చారు..

జగన్ అక్కడి నుంచి వెళ్లిపోయిన తర్వాత వైఎస్ షర్మిల కూడా ఇడుపులపాయ ఘాట్ కు చేరుకున్నారు. అనంతరం తండ్రి సమాధిపై పూల మాలలు ఉంచి నివాళులర్పించారు.. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం పేరుతో జనం గుండెల్లో చెరగని సంతకం చేసిన మహానేత వైయస్ఆర్. నా ప్రతి అడుగులో నాన్న గారే నాకు మార్గదర్శి. నాన్న గారే నాకు స్ఫూర్తి అని అన్నారు. మహానేత వైయస్ఆర్ గారి 76వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పక్షాన ఘన నివాళులు అర్పించానని తెలిపారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు సీఎంగా పని చేసిన ఆయన.. రాష్ట్రంలోనే కాదు దేశంలోను కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. సుపరిపాలన, సంక్షేమ పథకాలతో కోట్లాదిమంది గుండెలను తాకి.. ఆరోగ్య శ్రీ, ఫీజు రీయంబర్స్ మెంట్, జలయజ్ఞం లాంటి పథకాలుతో పాలనలో వైయస్ఆర్ మార్క్ చూపించారని తెలిపారు. కాగా, వైయస్ఆర్ మరణానంతరం హైదరాబాద్ లో ఒక మెమోరియల్ ఏర్పాటు కలగానే మిగిలిపోయిందని, . తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ నాయకత్వంలో వైయస్ఆర్ మెమోరియల్ ఏర్పాటుకు రేవంతన్న సానుకూలంగా స్పందించాలని కోరారు..

ఆందోళన వద్దు.. అండగా ఉంటాం ..

కడపలోని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు వైఎస్ జగన్ ని ఇడుపులపాయ ఘాట్ వద్ద నేడు కలిశారు. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అనుమతి లేకపోవడం, ఎడిసెట్ విడుదలపై వారం రోజులుగా స్టూడెంట్స్ ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇడుపులపాయలో వైఎస్ జగన్ను వాళ్లు కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. సమస్య పరిష్కారానికి తాను కృషి చేస్తానని జగన్ హామీ ఇచ్చారు. "విద్యార్థులకు మంచి యూనివర్సిటీ కడితే ఈ ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. వైఎస్సార్సీపీ విద్యార్థులకు అన్ని విధాల అండగా ఉంటుంది. వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఈ సమయంలో వైఎస్సార్సీపీ విద్యార్థి, యువజన విభాగాల నేతలు విద్యార్థుల వెంట ఉన్నారు.

# నేడు శ్రీశైలం నుంచి సాగర్ కు నీళ్లు విడుదల చేయనున్న చంద్రబాబు

శ్రీశైలం, జులై 8: ఏపీ సీఎం చంద్రబాబు ఇవాళ శ్రీశైలం వెళ్లనున్నారు. కృష్ణా నదికి భారీగా వరద వస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు సీఎం చంద్రబాబు.

ప్రాజెక్టులోకి లక్షా 62వేల క్యూసెక్కులు దాటి ఇన్‌ఫ్లో వస్తోంది. ఇంకా వరద పెరుగుతూ ఉండటంతో ఈరోజు నీటిని నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లోకి విడుదల చేయనున్నారు. మరోవైపు.. సీఎం చంద్రబాబు శ్రీశైలం పర్యటన సందర్భంగా ప్రాజెక్టు పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు పోలీసులు. ఈరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని తెలిపారు. శ్రీశైలం పర్యటన కోసం విజయవాడ ఉండవల్లిలోని తన నివాసం నుంచి ఉదయం 10 గంటలకు బయల్దేరనున్న సీఎం చంద్రబాబు.. ఉదయం 11 గంటలకు శ్రీశైలం సమీపంలోని సున్నిపెంట హెలిప్యాడ్ కు చేరుకుంటారు.. ఇక, సున్నిపెంట హెలిప్యాడ్ నుండి ప్రత్యేక కాన్వాయ్ లో రోడ్డు మార్గంలో శ్రీశైలం చేరుకోనున్నారు.. 11 గంటల నుండి 11:35 వరకు శ్రీస్వామి అమ్మవార్లని దర్శించుకోనున్న సీఎం చంద్రబాబు.. 11:50 నుండి మధ్యాహ్నం 12:10 వరకు శ్రీశైలం జలాశయం వద్ద జలహారతిలో పాల్గొంటారు.. 12:25 నుండి 1:10 వరకు నీటి వినియోగదారుల సంఘంతో సంభాషిస్తారు..


సాహిత్యం సంగీతం
శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్
ఆహ్వానం
ప్రముఖ రచయిత
శ్రీ తిరుమల వెంకటస్వామి (టి.వి.స్వామి) గారు
రచించిన "కవితావిక"
కవితా సంపుటి ఆవిష్కరణ, అంకితోత్సవం
తేది : 12-07-2025 శనివారం సా॥ 6-00 గం॥లకు
వేదిక : కళా లలిత కళావేదిక, శ్రీ త్యాగరాయ గానసభ, హైదరాబాద్.
సభాధ్యక్షులు : ప్రసార కళా ప్రవీణ డా॥ వోలేటి పార్వతీశం గారు, విశ్రాంత కార్యనిర్వహణాధికారి, దూరదర్శన్
ముఖ్య అతిథి, ఆవిష్కర్త : పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు, పూర్వ ఉపకులపతి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం
విశిష్ట అతిథి & కృతిస్వీకర్త : ఆచార్య కొలకలూరి మధుజ్యోతి గారు, పూర్వ ఉపాధ్యక్షులు, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
ఆత్మీయఅతిథులు : శ్రీ బండారుపల్లి రామచంద్రరావు గారు, ప్రముఖ ఆధ్యాత్మిక కవి, 'మానస' అధ్యక్షులు
శ్రీ సి.యస్. రాంబాబు గారు, విశ్రాంత సహాయసంచాలకులు, ఆకాశవాణి
ఆచార్య పి.వి.ఉమా శశి గారు, ప్రముఖ విద్యావేత్త
శ్రీ ఉమ్మడిసింగు రాఘవరావు గారు, ప్రముఖ కవి
గ్రంథకర్తస్పందన : శ్రీ టి.వి. స్వామి గారు, రచయిత
అందరికీ సాదర స్వాగతం
డా॥ లలితవాణి మానస ఉపాధ్యక్షులు
కోకా భవాని మానవ కన్వీనర్

# జీవో నెం.49ను రద్దు చేయాలి.. గవర్నర్ ను కలిసిన సోయం బాపూరావు



ఆదిలాబాద్, జులై 8: కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ పేరిట జారీచేసిన జీవో నెం.49 ఆదివాసీ హక్కులకు విఘాతం కలిగిస్తుందని, ఈ జీవో అమలు అయితే ఆదివాసీ గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకంగా మారనుందని మాజీ ఎంపీ, ఆదివాసీ సంఘాల ఉద్యమ నేత సోయం బాపూరావు అన్నారు. మంగళవారం మధ్యాహ్నం తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆదివాసీ సంఘాల నేతలు రాజు భవన్ లో కలిసి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.49ను రద్దు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు.

కొమురం భీం జిల్లాలోని ఆసిఫాబాద్ , కాగజ్ నగర్ డివిజన్లను ఏకపక్షంగా టైగర్ కన్జర్వేషన్ లో కలపడం వల్ల అటవీ భూములను నమ్ముకొని బతికే గిరిజనుల హక్కులకు భంగం వాటిల్లుతుందని సోయం బాపూరావు గవర్నర్ దృష్టికి తెచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు భూముల సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు ముందుకు వస్తున్న క్రమంలో జీవో నెం.49 జారీ చేయడం తగదని సూచించారు. ఇప్పటికే ఈ జిల్లాలో ఆ జీవోను రద్దు చేయాలని ఆందోళనలు చేస్తున్నారని, ఏకపక్షంగా జారీ చేసిన జీవో వల్ల ఈ జిల్లాలోని 339 ప్రభావిత గ్రామాల్లో గిరిజన, గిరిజనేతరులు ఆందోళన చెందుతున్నారన్నారు.

టైగర్ కన్జర్వేషన్ జీవో వల్ల తలెత్తే పరిణామాల గురించి గవర్నర్ అడిగి తెలుసుకోవడమే గాక ప్రభుత్వానికి నివేదిస్తానని హామీ ఇచ్చినట్టు సోయం బాపూరావు తెలిపారు. గవర్నర్ ను కలిసిన వారిలో సోయం బాపూరావుతో పాటు జాతీయ అఖిల భారతీయ గోండ్వానా మహాసభ ఉపాధ్యక్షులు సిడం అర్జు మాస్టర్, జిల్లా మేడి కురిసేంగా మోతిరాం, రాజ్ గోండ్ రాష్ట్ర కార్యదర్శి పెందూర్ సుధాకర్, రాజ్ గోండ్ సేవ సమితి జిల్లా కార్యదర్శి మాడవి నర్సింగ్ రావు, తిర్యాణి మండల సర్ మేడి అడసాను, మాజీ ఎంపీటీసీ ఉప మేడి ఆత్రం లింగు, రాజ్ గోండ్ సేవ సమితి జిల్లా ప్రచార కార్యదర్శి ఆత్రం చందన్ షా, ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షులు ఆత్రం రకు, మానవ హక్కుల సంగం జిల్లా అధ్యక్షులు ఆత్రం లింగారావ్ తదితరులున్నారు.

# వెంకటరాజం మృతి సీపీఐకి తీరని లోటు.. నివాళులర్పించిన పలు పార్టీల నాయకులు

కరీంనగర్, జులై 8:సమ, సమాజ స్థాపన కోసం, తాను నమ్మిన సిద్ధాంతం కోసం అహర్నిశలు కష్టపడుతూ తుది శ్వాస విడిచే వరకు కమ్యూనిస్టు పార్టీలో కొనసాగిన వేముల వెంకట్రాజం మరణం భారత కమ్యూనిస్టు పార్టీకి, వారి కుటుంబానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి వెంకటస్వామి పేర్కొన్నారు. వేముల వెంకట్రాజం మృతదేహంపై వెంకటస్వామి మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ జడ్పీటీసీ అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డితో పాటు జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సభ్యులు వెంకట్రాజం మృతదేహంపై రెడ్ క్లాత్, సీపీఐ జెండా కప్పి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ ఇందుర్తి ప్రాంతంలో సీపీఐ బలోపేతం కోసం పార్టీ బలోపేతం కోసం ప్రజాప్రతినిధుల గెలుపు కోసం నిరంతరం కష్టపడుతూ పనిచేశాడని అన్నారు. ఇందుర్తి సర్పంచ్, ఎంపీటీసీగా గెలిచి అటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఇటు గ్రామ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేశాడని, చిగురుమామిడి మండల పరిషత్ అధ్యక్షుడిగా కొంతకాలం పనిచేసి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడంతో పాటు గ్రామాల అభివృద్ధిలో కూడా కీలక పాత్ర పోషించారని వెంకటస్వామి పేర్కొన్నారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో పార్టీ పటిష్టత కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. వెంకట్రాజం అంత్యక్రియల్లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, కిన్నెర మల్లవ్వ, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, బూడిద సదాశివ, కంది రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కూన శోభారాణి, రైతు సంఘం మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి జయపాల్ రెడ్డి, సీపీఐ శాఖ కార్యదర్శులు ఎండీ ఉస్మాన్ పాషా, ఇల్లందుల రాజయ్య, మాజీ సర్పంచ్ బోయిని మొండయ్య, కూన లెనిన్, అందె చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



హైదరాబాద్, జులై 8:అంబర్ పేట్ నియోజకవర్గం వ్యాప్తంగా ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ తెలిపారు. మంగళవారం గోల్నాక డివిజన్ అశోక్ నగర్‌లో రూ. 34 లక్షల వ్యయంతో కొత్తగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలసి ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ.. నియోజకవర్గం వ్యాప్తంగా మౌలిక వసుతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని అన్నారు. రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ, మంచినీటి, వరదనీటి పైప్‌లైన్ల ఏర్పాటు పనులను ముమ్మరంగా చేపడుతున్నామని ఆయన తెలిపారు. అనంతరం కాలనీల్లో క్షేత్రస్థాయిలో పాదయాత్ర చేసి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# త్వరలో అమెరికాతో భారత్‌తో వాణిజ్య ఒప్పందం.. కీలక సూచనలు చేసిన జీటీఆర్ఐ..

న్యూఢిల్లీ, జులై 8:త్వరలోనే అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందాన్ని చేసుకోనున్నది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలకు సుంకాలను లేఖలు రాస్తున్నారు. అయితే, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసే ప్రక్రియలో భారత్ జాగ్రత్తగా ముందుకు సాగాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఈ వ్యాఖ్యలు చేసింది. ట్రంప్ మోడల్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కాదని.. ఇది అమెరికా సుంకాల ప్రతీకార ఒప్పందంగా పేర్కొంది. అమెరికా వివిధ దేశాలతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసేందుకు జులై 9తో ముగిసిన గడువును ఆగస్టు ఒకటి వరకు గడువును పొడిగించింది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం భారత్‌తో సహా ఇతర దేశాలు ఒప్పందం కుదుర్చుకోవడానికి మరో మూడు వారాల సమయం ఉన్నది. ఇప్పటివరకు బ్రిటన్, వియత్నాం మాత్రమే అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకున్నది.

చైనాతో కూడా తాత్కాలిక ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం ట్రంప్ ఒత్తిడిని పెంచుతున్నది. ఒప్పందం కుదుర్చుకోలేకపోతే ఆగస్టు ఒకటి అమెరికా దిగుమతులకు అడ్డంకులు తొలగించాలంటూ ట్రంప్ మరోసారి వాణిజ్య యుద్ధానికి దిగారు. అమెరికాలో తయారీని పెంచాలని.. ఈ ఒప్పందానికి అంగీకరించకపోతే భారీ సుంకాలు తప్పవంటూ 14 దేశాలకు లేఖ రాశారు. అమెరికా దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై 25 శాతం నుంచి 40 శాతం వరకు సుంకాలు తప్పవని హెచ్చరించారు. వాణిజ్య డిమాండ్స్‌కు అంగీకరించని దేశాలపై ఆగస్టు ఒకటి నుంచి సుంకాలు తప్పవని స్పష్టం చేశారు. ట్రంప్ ఆయా ఎదుర్కొనే సుంకాలను వివరిస్తూ 14 దేశాలకు అధికారిక లేఖలపై సంతకం చేసినట్లు జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. జపాన్, దక్షిణ కొరియా, కజకిస్తాన్, మలేషియా, ట్యునీషియాపై 25 శాతం, దక్షిణాఫ్రికా, బోస్నియా, హెర్జెగోవినాపై 30 శాతం, ఇండోనేషియాపై 32 శాతం, బంగ్లాదేశ్, సెర్బియాపై 35 శాతం, కంబోడియా, థాయిలాండ్‌పై 36 శాతం, లావోస్, మయన్మార్‌పై 40 శాతం సుంకాలను ప్రకటించింది.

అయితే, వైట్‌హౌస్ 'ఫైనల్ నోటీసు'గా హెచ్చరించిందని శ్రీవాస్తవ తెలిపారు. యూఎస్ నిబంధనలపై ఒప్పందంపై సంతకం చేయండి.. లేకపోతే ప్రతీకార సుంకాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరిస్తుందని.. దీంతో యూఎస్‌లో వినియోగదారుల ధరలను పెంచే అవకాశం ఉందని, ప్రపంచ సరఫరా గొలుసులలో విస్తృతమైన సమస్యలను సృష్టించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. మునుపటి కాలంతో పోలిస్తే మే 2025లో చైనా నుంచి యూఎస్ దిగుమతులు 35 శాతం తగ్గాయి. అయితే, న్యూఢిల్లీ ఒప్పందంపై జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఉన్న రాయితీలు, సరకుల రవాణా విషయంలో నెలకొన్న అస్పష్టమైన నిబంధనలు, అన్నింటపైనా ఒకే రేటుతో కూడిన పన్ను.. తదితర దీర్ఘకాలంలో వాణిజ్య స్థిరత్వానికి ప్రమాదాన్ని గురించి, లోటుపాట్లను పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని జీఆర్‌టీఐ సూచించింది.

# కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించకపోతే ఎమ్మెల్యే, ఎంపీల ఇండ్లను ముట్టడిస్తాం..



హైదరాబాద్, జులై 8: కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించకపోతే బోర్డు కార్యాలయంతో పాటు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఇండ్లను ముట్టడిస్తామని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి హెచ్చరించారు. మంగళవారం కంటోన్మెంట్ ఆరో వార్డులోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించకపోవడంతో స్థానికంగా నెలకొన్న సమస్యలు ఎక్కడికక్కడే తిష్ట వేస్తున్నాయని తెలిపారు. 2022లో ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్టే చేసి విత్ డ్రా గడువు ఇచ్చిన తరువాత కూడా ఎందుకు ఎలక్షన్ రద్దు చేశారనీ ప్రశ్నించారు.

భారత దేశంలోనీ 62 కంటోన్మెంట్ లలో బోర్డు నామినేటెడ్ సభ్యులతో పాలన చేయడం సరికాదన్నారు. ఈ విషయమై పలు మార్లు రక్షణ శాఖ మంత్రి, అధికారులతో పాటు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. రక్షణ శాఖ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించకుండా ప్రజల హక్కులను కాలరాస్తున్నారని మండి పడ్డారు. చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకొని ఎన్నికలను నిలుపుదల చేయడమేమిటి అని ప్రశ్నించారు. చట్టము ఎవరి చుట్టము కాదని గుర్తు చేశారు. బోర్డు పరిపాలన విభాగంలో ముగ్గురు మాత్రమే పాలించటం ఎంతవరకు సమంజసమని అడిగారు.

బోర్డు ఎన్నికల విషయమై బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి కూడా హైకోర్టును ఆశ్రయించిన ఫలితం లేకుండా పోతుందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం చేసేటివన్ని చీకటి చట్టాలు, చీకటి ఒప్పందాలనేనని మాటల ప్రభుత్వమే కానీ చేతల ప్రభుత్వం కాదని విమర్శించారు. కంటోన్మెంట్ ప్రజలు భారతదేశ పౌరులు కాదా! అని ప్రశ్నించారు. మీడియా సాక్షిగా చేతులు జోడించి అడుగుతున్న కంటోన్మెంట్ ప్రజల సౌలభ్యం నిమిత్తం ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర రక్షణ శాఖ అధికారులను కోరారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్, ఎంపీ ఈటెల రాజేందర్ కేంద్రంపై ఒత్తిడి చేసి ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

# దశలవారిగా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



హైదరాబాద్, జులై 8: నియోజకవర్గ పరిధిలోని కాలనీల సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చర్లపల్లి డివిజన్, చక్రీపురం కాలనీ నూతన సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి సమస్యలను వివరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. చక్రీపురం కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలను పరిష్కరించిన వెంటనే రహదారుల నిర్మాణం పనులు చేపడుతామని ఆయన పేర్కొన్నారు. కాలనీలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు కాలనీవాసుల భాగస్వామ్యంతో కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సన్మానించారు.

ఈ కార్యక్రమంలో చక్రీపురం సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గడ్డల పాండు ముదిరాజ్, సోమసాని ఆశోక్, గౌరవ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఉపాధ్యాక్షులు కొండారెడ్డి, లాల్‌సింగ్, సంయుక్త కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, ఎర్రయ్య, కోశాధికారి జగన్‌మోహన్‌రెడ్డి, ఉప కోశాధికారి యాకయ్య, కార్యనిర్వహాక కార్యదర్శులు చంద్రారెడ్డి, బ్రహ్మాచారిలతో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా తయారీలో బీఎల్ఓల పాత్ర కీలకం : ఆర్డీవో రమాదేవి

మెదక్, జులై 8: ఓటర్ జాబితా తయారీలో బూత్ లెవెల్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని మెదక్ ఆర్డీఓ రమాదేవి అన్నారు. మంగళవారం రోజు ఆమె మండల కేంద్రమైన పాపన్నపేటలోని ఉన్నత పాఠశాలలో బీఎల్ఓలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాపన్నపేట తహసిల్దార్ సతీష్‌తో కలిసి మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటరు జాబితా తయారీలో బూత్ లెవెల్ అధికారుల పాత్ర కీలకం అని అన్నారు. కేటాయించిన పోలింగ్ స్టేషన్ పరిధిలోని అన్ని ఇళ్లను సర్వే చేసి ,కొత్త ఓటరులను నమోదు చేయాలని , ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే సరి చేయాలని అన్నారు. అన్ని రకాల విషయాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ సతీష్ కుమార్ ,డిప్యూటీ తహశీల్దార్ చరణ్, ఆర్ఐ నాగరాజు , మాస్టర్ ట్రైనర్స్ సత్యనారాయణ రెడ్డి , వర ప్రసాద్ , అంజాగౌడ్ , నర్సింహులు , దేవి సింగ్ , పంచాయతీ ఈవో నయీమ్, సూపర్ వైజర్లు, కరణం కవిత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు.. రామగుండం కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి



కరీంనగర్, జులై 8:వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, అంటువ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రామగుండం కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి సూచించారు. నగర పాలక సంస్థలో నూతనంగా విలీనమైన గ్రామాలలో ఆయన మంగళవారం పర్యటించారు. ఇంటింటికి స్టిక్కర్లు అంటించారు.

దోమల నివారణకు నగర పాలక సంస్థ చేస్తున్న స్ప్రే, ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయడం తదితర పనులను పర్యవేక్షించారు. ప్రజలు కూడా దోమ తెరలు వాడటం, కిటికీలకు జాలీలు అమర్చుకోవడం చేయాలన్నారు. అనంతరం గోదావరిఖని శివాజీనగర్ కూరగాయల మార్కెట్ లోని మరుగుదొడ్డి నిర్వహణను పరిశీలించారు. గాంధీ చౌరస్తా నుంచి రామాలయం రోడ్డులో వ్యాపారులకు ట్రేడ్ లైసెన్సుపై అవగాహన కల్పించారు. రీగల్ షూమార్ట్ రోడ్డులో వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకం ప్రయోజనాలను వివరించారు.

గంగానగర్ లోని రంగానథ స్వామి ఆలయ ఆవరణలో జరుగుతున్న గోడ సందేశాత్మక చిత్రాలను పరిశీలించారు. వీకే రామయ్య కాలనీలో నిర్వహించిన వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ నాగభూషణం, కుమారస్వామి, హెల్త్ అసిస్టెంట్ సంపత్, వార్డు అధికారులు సాయి, గంగయ్య, శ్రీనివాస్, సీఓలు శ్వేత, శమంత, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

# స్టేట్ బ్యాంకులో దుర్గమ్మ బంగారం డిపాజిట్



అమరావతి, జులై 8: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే రెండు అతిపెద్ద దేవాలయమైన విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ప్రతి ఏటా భక్తులు అందించే విరాళాలతో అమ్మవారి క్యాష్ డిపాజిట్ లతోపాటు, బంగారం డిపాజిట్ కూడా పెరుగుతూ వస్తుంది. అన్ని దేవాలయాల్లోనీ బంగారు నిల్వలను దగ్గరలో ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో డిపాజిట్ చేయడం సర్వసాధారణం. గోల్డ్ మానిటైజేషన్ స్కీం ద్వారా బ్యాంకులు ఆలయాల నుండి బంగారాన్ని డిపాజిట్ రూపంలో స్వీకరించడంతోపాటు వీటికి వడ్డీని సైతం ప్రతి ఏటా క్రమం తప్పకుండా చెల్లిస్తూ ఉంటాయి.

గోల్డ్ డిపాజిట్లకు సంబంధించి 0.60 శాతం వడ్డీని బ్యాంకులు చెల్లిస్తుంటాయి. ఈ నేపథ్యంలోనే సోమవారం కనకదుర్గమ్మ వారికి భక్తులు మొక్కుల రూపంలో చెల్లించుకున్న బంగారాన్ని అధికారులు స్థానిక స్టేట్ బ్యాంకులో డిపాజిట్ చేశారు.

సుమారు రూ 27 కోట్ల రూపాయల విలువైన 29 కేజీల, 510 గ్రాముల బంగారాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డిపాజిట్ చేశారు. భక్తులు కానుకల రూపంలో అందిస్తున్న బంగారం చాలాకాలంగా స్ట్రాంగ్ రూమ్ లోనే భద్రపరిచి ఉంటూ వస్తుంది. గడిచిన కొంతకాలంగా ఈవోలు మారుతున్నప్పటికీ బంగారాన్ని బ్యాంకులో డిపాజిట్ చేయడానికి ముందుకు రాలేదు. ఇటీవల బాధ్యతలు స్వీకరించి. కార్యనిర్వహణ అధికారి, డిప్యూటీ కలెక్టర్ శీనా నాయక్ ఆలయంలో భద్రపరిచి ఉన్న బంగారు ఆభరణాల విలువను లెక్కించారు.

విజయవాడలో సోమవారం మార్కెట్ రేటు ప్రకారం 22 క్యారెట్ గోల్డ్ రేటు గ్రామ్ కు రూ 9010 ఉండగా అప్పగించిన బంగారం విలువ రూ 26 కోట్ల, 58 లక్షల 85 వేలు ఉండునట్లు అధికారులు అంచనా వేశారు. ఆలయ అధికారులు బృందంగా ఏర్పడి ఈ బంగారాన్ని ఎస్బిఐ అధికారులకు గ్రూప్ పూర్తి రక్షణ మధ్య అందజేశారు.

ఈ కమిటీలో జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పల్లం రాజు, దావాదేశా అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయ పర్యవేక్షకులు సుబ్రహ్మణ్యం ఉండగా దేవస్థానం కమిటీలు ఏఈఓ లు పి చంద్రశేఖర్, ఎం రమేష్ బాబు, ఎంఎస్ఎల్ వాసు, దేవస్థానం గోల్డ్ అప్రైజర్ డి షమ్మి, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ తో పాటు మరో ముగ్గురు కానిస్టేబుల్ సమక్షంలో గాంధీనగర్ ఎస్బిఐ బ్రాంచ్ అధికారులకు ఈ బంగారాన్ని సురక్షితంగా అందజేశారు.

ఈ పరిస్థితుల్లో అమ్మవారికి ప్రతి ఏట నగదు, బంగారు నిల్వలకు సంబంధించి వడ్డీ రూపంలో ఆదనపు ఆదాయం సమకూరనుంది.

# సరైన ధ్రువపత్రాల అనుమతితోనే ఫంక్షన్ హాలు నిర్మించాం.. చింతలపల్లి కిషన్‌రావు

కరీంనగర్, జులై 8: సరైన ధ్రువపత్రాల అనుమతితోనే లక్ష్మి నరసింహా ఫంక్షన్ హాలు నిర్మించామని యజమాని చింతలపల్లి కిషన్ రావు వెల్లడించారు. ఈ మేరకు ఆయన మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని కృష్ణానగర్ లో నర్రశాలపల్లికి వెళ్లే దారిలో ఉన్న తమ ఫంక్షన్ హాలుపై వస్తున్న ఆరోపణలు నిరాధారమని పేర్కొన్నారు. కొద్ది రోజులుగా కొందరు దురాశతో కావాలనే తమపై లేనిపోని ఆరోపణలు, అసత్యపు ప్రచారాలు చేస్తున్నారన్నారు.

ఫంక్షన్ హాలు వద్ద వాహనాల పార్కింగ్ కు సంబంధించి ప్రహరీ నిర్మాణంను నగర పాలక సంస్థ అధికారులు జారీ చేసిన నోటీసులకు కట్టుబడి తామే హుందాగా వ్యవహరించి స్వచ్ఛందంగా ప్రహరీని తొలగించామని పేర్కొన్నారు. ఫంక్షన్ హాలుకు అన్ని అనుమతులు ఉన్నాయనీ. కానీ తామంటే గిట్టనివారు నగర పాలక సంస్థ కార్యాలయంలో తప్పుడు ఫిర్యాదులు చేస్తూ తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. తమ పరువుకు భంగం కలిగించే విధంగా సోషల్ మీడియాలో కూడా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు.

# రౌడీషీటర్ల కదలికలపై నిఘా.. నేర ప్రవృత్తిని వదిలిపెట్టాలి : బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి

హైదరాబాద్, జులై 8: రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని బాలానగర్ ఏసీపీ పి నరేష్ రెడ్డి అన్నారు. మంగళవారం బాలానగర్ సీఐ నరసింహారాజు రౌడీ షీటర్లతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ నరేష్ రెడ్డి మాట్లాడుతూ బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచినట్లు తెలిపారు.

బోనాల పండుగను పురస్కరించుకొని ఎక్కడైనా శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడితే వారిపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. గతంలో నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవృత్తిని వదిలి సమాజంలో మంచి ప్రవర్తనతో నడుచుకోవాలని ఆయన సూచించారు. నేరస్తులు తొందరపాటుతనంతో చేసిన నేరాలు వారి కుటుంబ సభ్యులను ఇబ్బందుల్లో పడేశాయని గుర్తు చేశారు.

సత్ప్రవర్తన కలిగి ఉన్న నేరస్థులపై షీట్ ఎత్తివేసే అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నేరస్తులు సత్ప్రవర్తన దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సరళ, వినోద్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

